క్లుప్తంగా

ట్రాన్స్‌కో ఈఈగా చంద్రశేఖర్‌రెడ్డి



పీలేరు రూరల్ : పీలేరు డివిజన్ ట్రాన్స్‌కో ఈఈగా వై. చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు ఇక్కడ ఈఈగా పని చేస్తున్న ఎం. మునిచందర్ బదిలీపై చిత్తూరుకు వెళ్లారు. రాయచోటిలో ఈఈగా పని చేస్తున్న చంద్రశేఖర్ రెడ్డి బదిలీపై పీలేరుకు వచ్చి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు, రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి కృషి చేస్తామన్నారు.

రికార్డులు భద్రంగా ఉంచాలి

బి.కొత్తకోట : నగర పంచాయతీకి చెందిన రికార్డులన్నింటిని భద్రపర్చాలని కమిషనర్ పీఆర్. మనోహర్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన రికార్డులు భద్రపరచిన గదిని పరిశీలించారు. గ్రామ పంచాయతీ కాలం నుంచి ఉన్న రికార్డులు కీలకమైనవని అన్నారు. ఒక్క కాగితం కూడా వృథాగా పారబోయవద్దని సూచించారు. రికార్డులున్న గది భద్రతను పరిశీలించి సూచనలు చేశారు.

నిధుల వినియోగంపై ఆడిట్

బి.కొత్తకోట : బి.కొత్తకోట మండల పరిషత్, 15 గ్రామపంచాయతీల్లో 2023–24 ఆర్థిక సంవత్సరంలో వ్యయం చేసిన నిధులపై బుధవారం ఆడిట్ అధికారులు పరిశీలన చేపట్టారు. రాయచోటి ఆడిటర్ ఎం.శ్రీనివాసులు, సహాయ ఆడిటర్ బి.శివప్రసాద్ నిధులు మంజూరు, వాటి వినియోగంపై లెక్కలు, రికార్డులు పరిశీలిస్తున్నారు. నిధుల వినియోగానికి సంబంధించిన రికార్డులపైనే ప్రధానంగా పరిశీలించారు.

ప్రయాణికుల మన్ననలు పొందాలి



మాట్లాడుతున్న డీఎం వెంకటరమణారెడ్డి

మదనపల్లె సిటీ : ప్రయాణికుల మన్ననలు పొందితే సంస్థకు ఆదాయం కూడా పెరుగుతుందని ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక డిపో కార్యాలయంలో సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. డిపోకు త్వరలో కొత్త బస్సులు రానున్నట్లు తెలిపారు. ప్రయాణికుల మరింత సేవలు అందిస్తే ఆదాయం పెరగడంతోపాటు సంస్థకు పేరు ప్రఖ్యాతులు వస్తాయన్నారు. కార్యక్రమంలో సీఐలు రేవతి, గీత తదితరులు పాల్గొన్నారు.

చెరువుల్లో చేపల పెంపకం కోసం వేలం

ములకలచెరువు : మండలంలోని రెండు చెరువుల్లో చేపల పెంపకం కోసం బుధవారం వేలం నిర్వహించామని ఎంపీడీఓ పోలప్ప తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని దేవలచెరువుకు రూ.44 వేలు, చిన్న పాపిరెడ్డి చెరువును రూ.22,500లకు హెచ్చు పాటాదారులు వేలంలో దక్కించుకున్నారని ఎంపీడీఓ తెలిపారు. వేలంలో ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత



ఇందిరమ్మకాలనీలో అక్రమకట్టడాలు తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

మదనపల్లె : అమ్మచెరువుమిట్ట ఇందిరమ్మ కాలనీలో అక్రమకట్టడాలపై స్థానికులు ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు ఇచ్చిన ఫిర్యాదుపై స్పందించిన ఆయన తొలగించాల్సిందిగా రెవెన్యూ అధికారులకు ఆదేశాలిచ్చారు. దీంతో బుధవారం రెవెన్యూ, పోలీస్ అధికారులు అమ్మచెరువుమిట్ట ఇందిరమ్మకాలనీలోని అక్రమ కట్టడాలను జేసీబీతో తొలగించారు. ప్రభుత్వ స్థలంలో అక్రమ కట్టడాలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీచేశారు.

వేరుశనగలో బెట్ట నివారణకు చర్యలు

నిమ్మనపల్లె : ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ సాగుచేసిన రైతులు పంటలో బెట్ట నివారణకు తగు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి మురళీమోహన్ అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ... మండలంలో 820 ఎకరాల విస్తీర్ణంలో రైతులు సాగు చేశారన్నారు. వర్షాభావ పరిస్థితులతో వేరుశెనగ పంట బెట్టకు గురై ఎండిపోయే అవకాశం ఉందన్నారు. ఈ ప్రభావాన్ని తగ్గించేందుకు రైతులు 1లీటరు నీటికి 20 గ్రాముల యూరియా చొప్పున కలిపి ద్రావకాన్ని తయారు చేసి పంటపై పిచికారీ చేయాలన్నారు. పిచికారీ చేయడం వల్ల పంట సుమారు 15రోజులపాటు బెట్టను తట్టుకుంటుంటుందన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

పీలేరు : ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి గురువారం పీలేరులో పర్యటిస్తారని టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. గురువారం ఉదయం అజంతా టాకీస్ రోడ్డు, లక్ష్మీపురం, మోడల్ కాలనీల్లో పింఛన్ పంపిణీ చేస్తారని తెలిపారు. అనంతరం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమావేశంలో పాల్గొంటారని చెప్పారు.

బిడ్డకు అమ్మపాలే అమృతం



- నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు
- తొలి ఆరు మాసాలు తల్లిపాలే బిడ్డకు ఆహారం
- అంగన్‌వాడీల్లో గర్భిణులకు అవగాహన కార్యక్రమాలు



తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ (ఫైల్)

మదనపల్లె సిటీ : పుట్టిన బిడ్డకు తొలి ఆహారం, మొదటి టీకా తల్లిపాలే. పిల్లలకు అవే అమృత తుల్యం. బిడ్డ శారీరక ఎదుగుదలకు తల్లిపాలు ఎంతగానో తోడ్పడతాయని వైద్యుల సూచన. శిశువు జన్మించిన వెంటనే వీలైనంత వేగంగా ముర్రుపాలు తాగించాలి. దీంతో పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. అందుకే తల్లిపాల ఆవశ్యతను తెలిపేలా ఏటా ఆగస్టు తొలి వారంలో తల్లి పాల వారోత్సవాలు నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా మదనపల్లెలో అందుకు ఏర్పాట్లు చేశారు.

ఆరోగ్యంపై అవగాహన

మహిళలు గర్భం దాల్చిన నుంచి తల్లి పాల ఆవశ్యకత, బిడ్డ పోషణ, ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి. లేనిపోని అపోహలతో అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి పాలను దూరం చేయరాదు. ముర్రపాలు ఎంత వేగంగా బిడ్డకు తాగిస్తే అంత ఆరోగ్యకరం. ఈ నేపథ్యంలో గర్భిణులకు, బాలింతలకు, వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించేందుకు ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా తల్లిపాల వారోత్సవాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఆగస్టు 1 నుంచి 7 వరకు మదనపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీల్లో తల్లిపాల ప్రాముఖ్యత తెలిపేందుకు ఉద్యోగులు, ఆయాలు, సూపర్‌వైజర్లు సన్నద్ధంగా ఉన్నారు.

ముర్రుపాలతో రోగనిరోధక శక్తి

శిశువు జన్మించిన తొలి రోజుల్లో తల్లిపాలు చిక్కగా పసుపు రంగులో ఉంటాయి. వీటినే ముర్రపాలు అంటారు. ప్రొటీన్లు అధికంగా ఉండటంతో వీటిని శిశువు తీసుకోవడం ద్వారా రోగనిరోధక శక్తి పెరుగుతుంది. శిశువు జన్మించిన తొలి అరగంటలోపే ఈ పాలు పట్టడం ద్వారా రోగాల నుంచి శిశువును రక్షించుకోవచ్చు. ముర్రపాలలో విటమిన్ ఏ, బీలతో పాటు తగినంత ఐరన్ విలువలు కూడా ఉంటాయి. ముర్రుపాలు శిశువు ప్రేగులకు బలానిచ్చి, జీర్ణశక్తిని పెంచుతుంది. కామెర్లు, విరేచనాలు వంటి రుగ్మతల నుంచి శిశువును కాపాడుతాయి.

ఆరు మాసాల వరకు తల్లిపాలే ఆహారం

బిడ్డ పుట్టాక తొలి ఆరు మాసాలు తల్లిపాలే ఆహారం. తప్పనిపరిస్థితులు మినహా వేరే ఏ పాలూ బిడ్డకు పెట్టకుండా ఉండటమే మంచిదని వైద్యులు సూచన. మొదటి రెండు నెలల్లో బిడ్డకు రెండు గంటలకోసారి (రాత్రులైనా) పాలు పట్టాలి. రాత్రుళ్లు పాలివ్వడం వల్ల తల్లి మెదడు నుంచి ప్రొలాక్టిన్ ఎక్కువగా స్రవిస్తుంది. ఇది పాల ఉత్పత్తికి కావాల్సిన అతి ముఖ్యమైన హార్మోన్. ఎంత రాత్రయినా తల్లిపాలివ్వడం బిడ్డకు క్షేమం. నెలలు నిండే కొద్దీ ఈ వ్యవధి పెంచుకోవచ్చు. మొదటి ఆరు నెలలు తల్లిపాలు ఇవ్వడం ద్వారా బిడ్డకు తేలికగా జీర్ణమవుతుంది. శ్వాసకోశ, అలర్జీ, అస్తమా, చర్మవ్యాధుల నుంచి పిల్లలకు ఎంతో రక్షణనిస్తాయి. ఆరు మాసాల తర్వాత బిడ్డకు తల్లిపాలతో పాటు వైద్యుల సూచన మేరకు ఇతర ఆహారం ఇవ్వాలి.

ఆవు పాలు మంచివే..కానీ...?

కొందరు బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాల కంటే ఆవు పాలే పడతారు. ఇది మంచిది కాదని వైద్యుల సూచన. గేదె పాల కంటే ఆవు పాలలో కొవ్వు శాతం తక్కువ. అందుకే కేలరీలూ తక్కువే. 100 గ్రాముల ఆవు పాలల్లో ఉండే కేలరీలు,100 గ్రాముల తల్లి పాలల్లో ఉండే కేలరీలతో సమానం. అంతకు మించి తల్లి పాలకు, ఆవు పాలకు ఎలాంటి సారూప్యత లేదు.

శిశువుతో పాటు తల్లికి ఆరోగ్యం



అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు ముందుగానే అవగాహన కల్పిస్తున్నాం. శిశువు జన్మించాక వీలైనంత త్వరగా ముర్రుపాలు పట్టాలని చెప్తున్నాం. ఇది తల్లి బిడ్డకు ఆర్యోకరం. బిడ్డకు ఆరు మాసాలు వచ్చే వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి. బిడ్డకు అవసరమైన శక్తి తల్లిపాల ద్వారానే వస్తుంది. తొలి ఆరు మాసాలు, తల్లిపాలు తప్ప వేరే ఏ పాలూ ఇవ్వరాదు. ఏటా మాదిరిగానే ఈ ఏడా ఆగస్టు 1 నుంచి 7 వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లి పాల వారోత్సవాలు నిర్వహిస్తాం.

– సుజాత, సీడీపీఓ, మదనపల్లె

మామిడిలో యాజమాన్య పద్ధతులపై అవగాహన



మామిడి కొమ్మల కత్తిరింపుపై అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాసులు

కలికిరి : మామిడిసాగులో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పించినట్లు కేవీకే కో–ఆర్డినేటర్ డా. మంజుల తెలిపారు. బుధవారం మండల పరిధిలోని గుండ్లూరు, గుట్టపాళెం గ్రామాల్లో మామిడి తోటలను పరిశీలించిన కేవీకే శాస్త్రవేత్త డా. ఎ.శ్రీనివాసులు రైతులకు అవగాహన కల్పించారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా గత ఏడాది మామిడిలో పూత ఆలస్యంగా వచ్చి అకాల వర్షం, గాలి కారణంగా పంట నష్టం వాటిల్లడంతో దిగుబడి బాగా తగ్గిందన్నారు. మామిడి రైతులు కోతల తరువాత నెలవారి పద్ధతిలో యాజమాన్యం పాటించడం ద్వారా వచ్చే ఏడాది పూత సక్రమంగా రాడంతో పాటు అధిక దిగుబడి పొందడానికి వీలుంటుందన్నారు. కోత తరువాత 15 నుంచి 20 రోజులకు కొమ్మలు కత్తిరింపులు చేయడం వల్ల కొత్త చిగుళ్లు వస్తాయని, తరువాత లీటరు నీటికి యూరియా 20గ్రా. జింక్ సల్ఫేట్ 5గ్రా. కలిపి పిచికారీ చేయాలన్నారు. మామిడి రైతులు యాజమాన్య పద్ధతులను పాటించి అధిక, నాణ్యమైన దిగుబడి సాధించాలని తెలిపారు.

ప్రభుత్వ బోరు ప్రైవేట్ వ్యక్తుల స్వాధీనం



బోరును పరిశీలిస్తున్న బాస్ నాయకులు

పీలేరు : మండలంలోని వెంకటాద్రి ఇళ్ల కొత్తపల్లె కాలనీలో ఎస్సీ, ఎస్టీల కుటుంబాల దాహార్తి తీర్చడానికి వేసిన ప్రభుత్వ బోరును ప్రైవేట్ వ్యక్తులు స్వాధీనం చేసుకున్నారని భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) జిల్లా కోకన్వీనర్ పాలకుంట శ్రీనివాసులు అన్నారు. బుధవారం కొత్తపల్లె కాలనీలోని బోరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2021–22లో జలజీవన్ మిషన్ పథకం కింద ప్రభుత్వ నిధులు రూ. 2.89 లక్షల వ్యయంతో తాగునీటి బోరు వేశారన్నారు. బోరులో నీరు రాకపోవడంతో మరోబోరు వేయడంతో నీరు పుష్కలంగా పడ్డాయన్నారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారని తెలిపారు. అయితే ఆ బోరును గ్రామానికి చెందిన అగ్రవర్ణానికి చెందిన ప్రైవేట్ వ్యక్తి తన ఇంటికి పరిమితం చేసుకున్నారని తెలిపారు. దీంతో కాలనీలో తాగునీటి సమస్య నెలకొందని తెలిపారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బాస్ నాయకులు ముల్లంగి కృష్ణయ్య పాల్గొన్నారు.

సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి



పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్న ఏడీఏ వై.వి. రమణరావు

కేవీపల్లె : ఖరీఫ్ పంటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు, మెలకువలు పాటించడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చునని ఏడీఏ వై.వి. రమణరావు అన్నారు. బుధవారం మండలంలోని గ్యారంపల్లెలో పొలంబడి కార్యక్రమంలో భాగంగా రైతులకు పంటల సాగులో మెలకువలు, మనిషి శరీరంపై పురుగు మందుల విష ప్రభావం గురించి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ పంటల సాగులో సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి సారించాలన్నారు. తద్వారా తక్కువ ఖర్చు, అధిక దిగుబడుల తోపాటు ఆరోగ్యకరమైన పంట లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి శ్రావణి, ఏఈవో అనిత, రైతులు పాల్గొన్నారు.

హాస్టల్ భవనం కూల్చినవారిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న మలతోటి నరేష్

పీలేరు రూరల్ : ములకలచెరువులో బీసీ హాస్టల్ భవనం కూల్చినవారిపై చర్యలు తీసుకోవాలని మాల స్టూడెంట్ ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) రాయలసీమ అధ్యక్షుడు మలతోటి నరేష్ డిమాండ్ చేశారు. ములకలచెరువు నందు బీసీ బాలుర హాస్టల్‌కు ఓనరు రమణమ్మ తన భవనంను అద్దెకు ఇచ్చినట్లు తెలిపారు. ఇటీవల హాస్టల్ భవనాన్ని గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కూల్చివేశారన్నారు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం సరైంది కాదన్నారు. ఆ భవనంకు పంచాయతీ పన్నులు, కరెంటు బిల్లులు అన్నీ ఉన్నాయని తెలిపారు. బిల్డింగ్ కూల్చి వేసిన వారిపై చర్యలు తీసుకుని రమణమ్మకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ విద్యార్థులు పాల్గొన్నారు.

క్రమశిక్షణ, అంకితభావంతో మెలగాలి

మదనపల్లె సిటీ : విద్యార్థులు క్రమశిక్షణతో పాటు అంకితభావంతో మెలగాలని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీలో బిటెక్ నూతన విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఇంజినీరింగ్ విద్య ఆవశ్యతను వివరిస్తూ నాక్ ఏ–ప్లస్, అటానమస్ హోదా రావడం గర్వకారణమన్నారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ఇంటర్న్‌షిప్, ఎన్‌పిటెల్ కోర్సులు చేయాలని తెలిపారు. నాణ్యమైన విద్యను అభ్యసించాలని తెలిపారు. కాలేజీ న్యూస్ లెటర్–24ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రామమోహన్‌రెడ్డి, ప్రెసిడెంట్ నాగమల్లారెడ్డి, కాలేజీ ప్రిన్సిపాల్ సతీష్‌బాబు, డీన్ భాస్కర్, విజయభాస్కర్, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి



మాట్లాడుతున్న ఆర్ఆర్ఆర్ ఎడ్యుకేషనల్ అకాడమి అధ్యక్షుడు ద్వారకనాథ్

కురబలకోట : విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆర్ఆర్ఆర్ ఎడ్యుకేషనల్ అకాడమి అధ్యక్షుడు నాదేళ్ల ద్వారకనాథ్ కోరారు. బుధవారం అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ నూతన విద్యార్థులకు తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ నాదేళ్ల విజయభాస్కర్ చౌదరి ఆధ్వర్యంలో జరిగిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ చదువు అన్ని రుగ్మతలకు ఔషధం లాంటిదన్నారు. సాంకేతికంగా పట్టు సాధిస్తే తిరుగులేని కేరీర్ సాధ్యం కాగలదన్నారు. పట్టుదలతో చదివితే ఎంతటి స్థాయికైనా చేరుకోవచ్చన్నారు. కళాశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు.

శివకుమార్‌శర్మకు సిద్ధాంతరత్న బిరుదు



సిద్ధాంతరత్న బిరుదు అందుకుంటున్న శివకుమారశర్మ

మదనపల్లె సిటీ : మదనపల్లెకు చెందిన కాణిపాకం ఆస్థాన పంచాంగకర్త, వాస్తు, పంచాంగకర్త డాక్టర్ అత్తులి శివకుమార్‌శర్మకు సిద్ధాంతరత్న బిరుదుతో సత్కరించారు. గండి వేంపల్లెలో జరిగిన అఖిల భారతీయ బ్రాహ్మణ మహాసంఘం ఆధ్వర్యంలో పంచాంగకర్తల సదస్సులో సిద్ధాంత రత్న బిరుదును ప్రముఖ పంచాంగ దైవజ్ఞులు బివిఎస్ బుట్టే వీరభద్ర, బొర్రా వెంకటేశ్వరశర్మలు అందజేశారు. సిద్ధాంతభాగంలో చేసిన కృషికి బిరుదును అందించారు. ఆయనకు అఖిల భారతీయ బ్రహ్మణ మహాసంఘం నాయకులు అభినందించారు.

ఏపీయూడబ్ల్యూజే మహాసభలను విజయవంతం చేయండి

మదనపల్లె : ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రథమ మహాసభలను విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా కో కన్వీనర్లు వంశీధర్, లోకనాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాయచోటి పట్టణంలోని ప్రీతం రెసిడెన్సీలో గురువారం ఏపీయూడబ్ల్యూజే జిల్లా ప్రథమమహాసభలు నిర్వహిస్తున్నామని, మదనపల్లె డివిజన్‌లోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలకు చెందిన పాత్రికేయులు హాజరుకావాలని కోరారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర రవాణా, యువజన, క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఏపీయూడబ్ల్యూజే అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐవీ.సుబ్బారావు, చందుజనార్ధన్, విశిష్ట అతిథులుగా కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు హాజరవుతారన్నారు.

సకాలంలో పెన్షన్ల పంపిణీకి చర్యలు

తంబళ్లపల్లె : మండలంలోని పెన్షనర్‌దారులకు గురువారం సకాలంలో పంపిణీ చేయడానికి తగిన చర్యలు తీసుకున్నట్లు ఎంపీడీఓ క్రిష్ణమూర్తి తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో పెన్షన్ల పంపిణీపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పెన్షన్ల పంపిణీపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మండలంలో అన్ని రకాల పెన్షన్లు 6,265 మందికి పంపిణీ చేయాల్సి ఉందన్నారు. సచివాలయ ఉద్యోగులు 95 మంది పెన్షన్‌దారుల వద్దకే వెళ్లి ఇవ్వాలన్నారు. ఎలాంటి ఆరోపణలు రాకుండా పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ దిలీప్‌కుమార్, ఎంఈఓ త్యాగరాజు, ఏఓ ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె డీఎస్పీగా దర్బార్ కొండయ్యనాయుడు

మదనపల్లె : మదనపల్లె సబ్ డివిజనల్ పోలీస్ అధికారిగా (ఎస్‌డీపీఓ)గా దర్బార్ కొండయ్యనాయుడు నియమితులయ్యారు. బుధవారం డీజీపీ సీహెచ్ ద్వారకాతిరుమలరావు, మంగళగిరిలోని ఆయన కార్యాలయంలో జరిగిన పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ బోర్డ్ మీటింగ్‌లో తీసుకున్న నిర్ణయాల ప్రకారం డీఎస్పీ(సివిల్)లను బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువరించారు. అందులో డీఎస్పీ వెయిటింగ్‌లో ఉన్న దర్బార్ కొండయ్యనాయుడును మదనపల్లె ఎస్‌డీపీఓగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ప్రస్తుతం మదనపల్లెలో పనిచేస్తున్న డీఎస్పీ జి.ప్రసాదరెడ్డిని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించారు.

గుండ్లపల్లె రహదారి సమస్యను పరిష్కరించండి

తంబళ్లపల్లె : మండలంలోని గుండ్లపల్లె దళిత కాలనీలో నెలకొన్న రహదారి సమస్యను పరిష్కరించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు మల్లికార్జున అధికారులను నిలదీశారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ కాలనీలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. గుండ్లపల్లె దళితవాడలో నెలకొన్న రహదారి సమస్యను పలుమార్లు అధికారులను విన్నవించినా పట్టించుకోలేదన్నారు. దళిత, గిరిజనుల కాలనీల్లో ఎక్కడ చూసినా మౌలిక సదుపాయలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తహసీల్దార్ ఇషాక్, ఎంపీడీఓ కృష్ణమూర్తిలు స్పందించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

నేటి నుంచి ఉర్దూ టెట్‌కు ఉచిత శిక్షణ

మదనపల్లె సిటీ : స్థానిక మున్సిపల్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో టీచర్ ఎలిజిబిలిటీ టెస్టు (టెట్)కు గురువారం నుంచి ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ కోఆర్డినేటర్ షాజహాన్ తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనారిటీస్ ఆధ్వర్యంలో కోచింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టెట్‌కు హాజరయ్యే విద్యార్థులు స్థానిక మున్సిపల్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటలకు హాజరై తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. విద్యార్థులకు సెప్టెంబర్ 15వతేదీ వరకు ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే స్టడీ మెటీరియల్ ఉచితంగా అందజేస్తామన్నారు. వివరాలకు 9393315343 నంబరుకు సంప్రదించాలని కోరారు.

పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి

మదనపల్లె : పట్టణంలో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్న నేపథ్యంలో ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించామని మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి అన్నారు. బుధవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నెలరోజులుగా కాలువల్లో పూడికతీతల పనులు చేయిస్తున్నామన్నారు. పట్టణ నడిబొడ్డున వెళుతున్న బాహుదా కాలువలో పిచ్చిమొక్కలు తొలగించి, పరిసరాలన్నింటినీ శుభ్రం చేయించామన్నారు. దోమల నివారణ చర్యల్లో భాగంగా ఫాగింగ్, స్ప్రేయింగ్, మురుగు నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వార్డు కౌన్సిలర్లు విధిగా వార్డుల్లో పర్యటించి, ప్రజాసమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అనంతరం అజెండాలోని 55 అంశాలను చదివి వినిపించగా సభ్యులు మూడు అంశాలపై అభ్యంతరం తెలిపారు. కౌన్సిలర్ బి.ఏ.ఖాజా మాట్లాడుతూ..17వ అంశానికి సంబంధించి నిరుపయోగంగా ఉన్న వాహనాల వేలంలో మినీ జేసీబీకి రూ.31,000 ధర నిర్ణయించడంపై అభ్యంతరం తెలిపారు. 30లక్షలు విలువచేసే జేసీబీ అగ్నిప్రమాదంలో కాలిపోయి, పోలీస్‌కేసులో ఉన్నందున ఇన్సూరెన్స్ డబ్బులు వచ్చి ఉంటే స్క్రాప్‌కు వేసినా పర్లేదని, లేనిపక్షంలో మున్సిపాలిటీ తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందన్నారు. దీనిపై ఏఈ శిరీషా సమాధానమిస్తూ... స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్‌కి ఈ విషయమై 2021లో లేఖ పంపామని, వారు ఇన్సూరెన్స్ క్లైమ్ చేసుకుని, స్క్రాప్ కింద వాడుకోవాలని చెప్పడంతో వేలం వేసేందుకు నిర్ణయించామన్నారు. పలువురు కౌన్సిలర్లు వారి వార్డుల్లోని సమస్యలను తెలియజేశారు. వైస్‌చైర్మన్ నూర్‌ఆజం మాట్లాడుతూ..బాహుదా కాలువలో చికెన్‌వ్యర్థాలు వేసి అపరిశుభ్రం చేస్తున్న నేపథ్యంలో కట్టడి చేసేందుకు హోర్డింగ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. కుక్కలబెడద అధికంగా ఉందని, నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఈ శ్రావణి, ఏఈ స్నేహప్రియ, బండపల్లిశిరీషా, ఆర్వో నాగేశ్వరరావు, ఆర్ఐలు నాగరాజ, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

మహమ్మద్ రఫీకి నివాళులు



మహమ్మద్ రఫీకి నివాళులు అర్పిస్తున్న మరసం సభ్యులు

మదనపల్లె సిటీ : ప్రముఖ సినీ గాయకుడు మహమ్మద్ రఫీ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక మదనపల్లె రచయితల సంఘం (మరసం) కార్యాలయంలో బుధవారం నివాళులు అర్పించారు. తెలుగు సినిమాల్లో ఆయన పాడిన పాటలు ఇప్పటికి మరవలేమన్నారు.ఆయన ఆలపించిన గీతాలను పాడి వినిపించారు. కార్యక్రమంలో మరసం కార్యదర్శి లింగాల యుగంధరాచారి, నాగరాజు, నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

వేమనారాయణ సేవలు అద్వితీయం



వేమనారాయణ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

కలికిరి : మండల పరిషత్ కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ అధికారి వేమనారాయణ చేసిన సేవలు అద్వితీయమని ఎంపీడీఓ రామక్రిష్ణయ్య అన్నారు. వేమనారాయణ పదవీ విరమణ సందర్భంగా బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు గంగయ్య, సోమశేఖర్‌రెడ్డి, ఎంఈఓలు కరీముల్లా, నాగార్జున, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంతర పంటల సాగుతో అధిక ఆదాయం

కలకడ : వేరుశనగ పంట సాగులో అంతర్ పంటలతో ప్రతి రైతు అధిక ఆదాయం పొందవచ్చునని వాల్మీకిపురం వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు వాణిశ్రీ అన్నారు. బుధవారం మండలంలోని దేవులపల్లెలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వేరుశనగ పంటను పరిశీలించి అధిక దిగుబడికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. యాజమాన్య పద్ధతులు, విత్తనశుద్ధి, భూసార పరీక్షలు, చీడపురుగుల నివారణ, లింగాకర్షకబుట్టల ఏర్పాటు, మిత్ర పరుగుల సంరక్షణ ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఏఓ లావణ్య, ఏఈఓ శివకుమార్, ఆర్‌బికె ఇన్‌చార్జి రజేంద్రబాబు, రైతులు పాల్గొన్నారు.

ఉచిత పాఠ్యపుస్తకాలు సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. చెన్నకేశవులు

కేవీపల్లె : ఏపీ గురుకుల కళాశాలలో ప్రభుత్వం అందించిన ఉచిత పాఠ్యపుస్తకాలు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. చెన్నకేశవులు అన్నారు. బుధవారం కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సర విద్యార్థులు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు గత విద్యా సంవత్సరం వందశాతం ఫలితాలు సాధించారన్నారు. ఈసారి కూడా వందశాతం ఫలితాలు సాధించడంతోపాటు అత్యుత్తమ మార్కులు సాధించాలని కోరారు.

డయేరియా నియంత్రణకు కృషి చేద్దాం



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి శ్రీవిద్య

వాల్మీకిపురం : డయేరియా నియంత్రణ కృషి చేద్దామని మండలంలోని చింతపర్తి పిహెచ్‌సి వైద్యాధికారి శ్రీవిద్య అన్నారు. బుధవారం మండలంలోని బోయపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న 104 వైద్య సేవలలో స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా తల్లులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 0 నుంచి 05 సంవత్సరాలలోపు పిల్లల గృహ సర్వేలు నిర్వహించి, ఓఆర్ఎస్ క్యాంపెయిన్, డమాన్‌స్టేషన్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది మహమ్మద్ రఫీ, భానుబి, తదితరులు పాల్గొన్నారు.